# ప్రణయస్వరూపాలు

వంకమామిడి బాలకృష్ణమూర్తి.

—•కా•—

రాధా!

నీప్రేమహస్తలిఖితలేఖామృతం బెన్ని పర్యాయములు గ్రోలితినో లెక్కలేదు. మన వివాహవిషయమై తండ్రిగారిని హెచ్చరింపుము అశ్రద్ధచేయకుము. సాక్షాత్కరించుచున్న నీ మూర్తి నాచదువున కంతరాయము గల్గించుచున్నది. నీకోమలహస్తస్తన, ముఖ, తను, స్పర్శలకు వ్విళ్లూరుచున్న నాడెందమును నీసామీప్యమున కెప్పుడు జేర్చెదనా? యని తహతహలాడుచుంటిని. నాసర్వస్వమునకు నిన్నధికారిణిని గావించి, నీప్రేమసామ్రాజ్యమున కెప్పుడు చక్రవర్తినయ్యెదనా? యని పదేపదే తలంచుచుంటిని. నీప్రేమకు పాత్రుడనయిన వెన్క, కృష్ణుడనుపేరునకు రాధయను నీప్రణయస్వరూప బీజాక్షరములం జేర్చి రాధాకృష్ణుడనైతిని. మన్నింపుము. ఇట్లు రాధాకృష్ణుడు-

ఎన్నిపర్యాయములాలేఖపఠించినదో ఆమెకే తెలియదు. లేఖానానందబాష్పములతో నింపివైచినది. ... వెంటనే దుఃఖమునకు గురియైనది.

—•ల•—

రా—తల్లీ! యీకఠిననిర్బంధము తప్పదా?

తల్లి—నీవొక్కతెవే లోకమును పొడిచి పుట్టితివా?...

రాధ—నేపొడిచిపుట్టితినని చెప్పితినా! తల్లీ!

తల్లి-కాకున్న మరేమి? ధనహీనుడనియా? రూపహీనుడనియా? విద్యాహీనుడనియా? కఠిననిర్బంధమట, నీతోడిదిగాదా? మణి, మేనమామనట్లుప్రేమించి వివాహమాడినదో? చూడుము.

రాధ—ఔను ఆమెప్రేమకాతడు గురియైనాడు, అతనిని విడిచి మరియొకని వివాహమాడుమన్నచో?

తల్లి—నోరుమూయుము, నీప్రేమకీతడు గురికాడా? ఎక్కడనేర్చితివీవిపరీతసంభాషణ...

రాధ—విపరీతమేమున్నదితల్లీ! వివాహవిషయమున స్వాతంత్ర్యమిమ్మంటిని, బ్రతిమాలుచుంటిని.

తల్లి—యిక నెక్కువప్రేలకుము, స్వాతంత్ర్యమా? యేకడజాతివానిని వివాహమాడుటకు?

రాధ—హరిహరీ! తల్లీ! ఎందుకట్లనెదవు, కడజాతివానిని వివాహమాడుదునా? తల్లి—నీవెన్నివాగినను యీవరుడు నీకుతప్పడు, పొమ్ము, తండ్రిగారిని భోజనమునకుపిలువుము.

—•చ•—

భార్యమాట మీరజాలని ప్రభాశంకరుడు, దుఃఖితయగు రాధను భార్యాసోదరుడగు సుందరునిచేతి యమపాశములచే బంధితనుగావించినది మొదలు, రాధ అపారమైన దుఃఖసాగరమున నీదులాడుచు, దరిగానక కొట్టుకొనుచుండెను. ఈస్థితియందున్న రాధను సన్మార్గమున బెట్టవలయునని శంకరుడెన్ని ప్రయత్నముల గావించెనో, కాని, విఫలుడయ్యెను. తల్లియగుశ్యామల మాత్రము „దీనికి మదముపిచ్చియెత్తినది" అనుచుండెడిది. ఈపరిస్థితులదిలంకించుచున్న సుందరుడు „హిస్టీరియాయగునేమో?" అని మామగారితో ననుచుండెడివాడు,... రాధ దుఃఖపూరితనయనములతో చలనహస్తములతో క్షణమునకొకయక్షరముచొప్పున విషాదలేఖపూర్తిగావించి దాసిచే పోస్టునకంపినది. ఆదినము నుండియే మంచముపట్టి వ్యాధిపీడితగా జొచ్చెను.

—•క్రి•—

ఆదినమాదివారమగుటచే, హాస్టలుగదిలో కుర్చీయందాసీనుడై, క్లాసుబుక్కు చదువుచున్న రాధాకృష్ణుని చేతియందొక జాబునిడి, పోస్టు

వ్యాను వెడలిపోయెను. కృష్ణుడు సంతోషాతి రేకమున లేఖం దెరచిచూచెను. అందేముండెనో కళాహీనమైనముఖముతో, వుబికివచ్చు నుష్ణ ధార కొలకులందణచికొనుచు మరల నిట్లు చదువనారంభించెను.

కృష్ణా

పరాధీననైతిని. భార్యమాట మీరజాలని ప్రభాశంకరుడు తల్లిమాట జవదాటలేని రాధ నారాధా కృష్ణనామమునకు విఘ్నమాపాదించిరి. క్షమింపుము, నన్ను మరచిపొమ్ము. యేమో తనీకొరకై పూజసల్పుచున్నదో? నన్నువలెనే ప్రేమింపుము. యీజన్మమున మరికలసి కొనజాలము. ఇట్లు వక్రప్రేమగల రాధ

రాధా! ఇది నిక్కమా? నన్నధోగతిపాలొనర్చితివా ? యీజన్మమున కలసికొనజాలమా ? అయ్యో... ఆ... యేమంటివి. నీవలె నింకొకతెను ప్రేమింపవలెనా ? ఆహా ! చివరకెంత నీచునిజేసితివి. నీప్రేమకు పాత్రుడనైన నేనింకొకతెను ప్రేమింపగలనా ? రాధా ! నీవేశరణ్యము. రాధా ! ...రా...ధా !! హోరుననేడ్చుచు యెదుటనున్న మంచముపై కూలబడెను.

—•○•—

యెన్ని యౌషధముల ప్రయోగించినను, రాధలోనిమిడీయున్న వ్యాధిని నిర్మూలింపలేక పోయినవి. కన్నుమూసినను తెరచినను కృష్ణనామస్మరణము తప్ప వేరులేదు. యిపుడు పశ్చాత్తాపము పొందుచున్న శ్యామలతోపాటు ప్రభాశంకరుడు, కంటికి మంటికి నేకధారగా నేడ్చుచుండిరి. సాయంత్రి మూరుగంటలవేళ గణగణమను మోతతో నశ్వశకట మొకటా బహిర్ద్వారముకడ నాగెను. అందుండి మూర్తీభవించిన మన్మథుడోయన నొప్పి నాగుమీసముచే నొప్పారు ఇరువదివత్సరముల, యువకుడు సరాసరిలోనకేగి, రాధశయ్యపై గూరుచుండి, ఆ బాలికకోమలహృదయముపై శిరమిడి, అయ్యో! రాధా కాలచక్రమిట్లు వక్రముగ దిరిగెనా? యని భోరున నేడ్చియేడ్చి కనులు వేలవైచెను. రాధ కనులుదెరచిచూచెను. ఆమెహస్తముల ప్రయత్నముగా నాతనిచుట్టవైచినవి. ఆమె మాటాడలేని స్థితియందున్నది. కృ...ష్... ణా .మరి చలనములేదు. యీదృశ్యమును చూడజాలక సూర్యుండపరాబ్ధింగ్రుంకెను.

# రైల్వేస్టేషన్

కొప్పాక వెంకటేశ్వరరావు.

మాకు ఆటవిడుపు శలవు లిచ్చారు. సహారా యెడారి లాగుండే బెజవాడలో యీయెండాకాలమందుండలేక, మాయూరికి బయలుదేరినా నా పెట్టె బేడతో ఎండలో నాకు Send off యివ్వటానికి నాతో వచ్చాడు మా Ram (శ్రీరామపాదుకాపట్టాభిషేకము 'పాదుక' యని పూరినట్లు మా రామావధాన్ల పేరల్లా Ram గ తారుమారయింది.)

మాయింటి దగ్గరనున్న ఓచిన్న ముసాఫిరీ కాఫీహోటల్లో చక్కగ సాంబారుతో స్నానము చేసిన యిడ్లీద్వయమును, అరకప్పు light coffee ను దాల్చి, కిళ్లీ ఝాడించి గిల్టునందేర్చి రెండు

508